

# కృతి – ఆకృతి

– అపర్ణ మునుకుట్ల గునుపూడి



## 01

ఈ శీర్షిక ఉద్దేశ్యం కర్ణాటక సాంప్రదాయ సంస్కృతాంధ్ర కృతులలో భాష, భావన, రాగ ప్రకటన తెలిపి మీకు శ్రావ్యానుభూతి కోసం ఆ కృతిని కూడా జత పరిచి మీ కందించాలని. ఈ కృతులందరికి తెలిసినవే, అయినా వాటి సాహిత్య, భావ మరియు రాగ ప్రకటనలు తెలిసేక మళ్ళీ విన్నప్పుడు ఆ కృతియొక్క ఆకృతిలో మీకు మరొక కోణం కనిపించవచ్చునేమో అన్నదే మా ఆలోచన, ఈ చిన్ని ప్రయత్నం.

ముఖ్య గమనిక: పల్లవి, అనుపల్లవి, చరణములు ఉండి, సంగీత ప్రాధాన్యత కలిగి పెక్కు సంగతులతో రాగసంచార, భావప్రస్తారమునకు వీలుగా, స్వరకల్పనలో పాండిత్య ప్రతిభను ప్రదర్శించు విధముగా ఉన్నటువంటివి కృతులు.

పల్లవి, అనుపల్లవి (కొండొకచో లేకున్నను), పెక్కు చరణములు కలిగి ఒకే పద్ధతిలో గానము చేయగలిగి, భావ ప్రాధాన్యత కలిగినటువంటివి కీర్తనలు.

గాత్రం: తనికెళ్ళ చంద్ర భాను
రచన: త్యాగరాజు
రాగం: సౌరాష్ట్ర
తాళం: ఆది తాళం

**ఈ కృతిని ఇక్కడ క్లిక్ చేసి వినవచ్చు**

పల్లవి: శ్రీ గణపతిని సేవింపరారే శ్రీత మానవులారా

అనుపల్లవి: వాగాధిపాది సుపూజల చేకొని
బాగా నటింపుచు వెడలిన శ్రీ

చరణం: పనస నారికేళాది జంబూ ఫలములారగించి
ఘనతరమ్ముగను మహిపై పదములు

ఘల్లు ఘల్లన నుంచి
అనయము హరి చరణ యుగములను
హృదయాంబుజమున నుంచి
వినయమునను త్యాగరాజ వినుతుడు
వివిధగతుల ధిత్తళాంగుమని వెడలిన శ్రీ

ఇది వినగానే మనకళ్ళకి ఊర్ధ్వపాదంతో, కరిహస్త ముద్రతో నాట్యం చేస్తున్నగణపతి, పక్కనే సేవలకై పెట్టినటువంటి దీప ధూప నైవేద్యాలు అమర్చినట్టుగా ఒక చక్కని చిత్రం గోచరించి చేతులెత్తి నమస్కారం చెయ్యాలనే అనుభూతి కలుగుతుంది. దానికి కారణం, వారు వాడిన సరళమైన పదాలు, అతి మృదువైన భావం. ఇది ద్రాక్షపాక లక్షణములతో ఉన్న కృతి. ఇందులో గణపతి, బ్రహ్మ మొదలు ఇతర దేవతల పూజలు అందుకుని ఆనందంతో నర్తిస్తూ వెళుతున్నాడని అంటారు. దాంతో మనం కూడా వెంటనే పూజ చేయాలన్న ఒక ఆతురతని కలిగిస్తుంది. తరువాత చరణంలో వివరంగా పనస, కొబ్బరి, నేరేడు ఫలాల నైవేద్యం గైకొని, గణపతి ఊర్ధ్వలోకాలనుంచి మన మధ్యకి అంటే ఈ మహిపైకి నాట్యం చేసుకుంటూ తిరుగుతున్నట్టు వర్ణిస్తారు. ఇది వింటూండగానే మనం అప్రయత్నంగా నర్తన గణపతి కోసం చుట్టూతా కలయజూడటం మొదలు పెడతాం. గణపతి ఈశ్వర పుత్రుడైనా తన హృదయంలో శ్రీ హరి పాద పద్మాలను స్థిరపరుచుకున్నాడుట. తల్లి తండ్రి గురువు దైవం వరుసలో ఈశ్వరుడిని తండ్రిగా ఎలాగూ గౌరవిస్తాడు కనక హరిని దైవంగా తలుచుకుంటున్నాడన్న భావం వ్యక్తమవుతోంది. విగ్రహాలు, పటాలు అవసరం లేదన్నట్టు ఒక చక్కని రూపాన్ని మన మనో ఫలకం పై చిత్రీకరిస్తారు. ఈ కృతిని ఆలపించినా , ఆలకించించినా అది నిర్గుణోపాసనకి మొదటి మెట్టు. అంటే ఒక విగ్రహం కానీ, బొమ్మ కానీ అవసరం లేకుండా శ్రోతల మనసులో ఒక రూపాన్ని స్థాపించి అనాలోచితంగానే భగవద్భక్తి భావాన్ని కలిగించే కృతి అన్నమాట. త్యాగరాజువారు ప్రసిద్ధి చెందిన వాగ్గేయకారులని తెలిసినా ఈ కృతిని విన్నాక అయన గొప్ప తాత్విక చిత్రకారుడా అన్న సంశయం వస్తుంది.

ఈ కృతికి ఇంకొక విశిష్టత ఏమిటంటే ఇది త్యాగరాజువారి సంగీతరూపకం ప్రహ్లాద భక్తి విజయంలో నాంది కీర్తన. త్యాగరాజువారు మూడు సంగీత రూపకాలు రాసేరు. సీతారామ విజయం, ప్రహ్లాద భక్తి విజయం, నౌకా చరితం. ప్రస్తుతం సీతారామ విజయంలో కృతులు మనకి అందుబాటులో లేవు కానీ మిగతా రెండిటికీ పూర్తిగా వాడుకలో ఉన్నాయి. ఇహ పోతే ఈ కృతి సంగీత రూపకంలోది కనక వాటి వివరాలు కొద్దిగా పరిశీలిద్దాం. రూపకాలని నాట్యశాస్త్రంలో కావ్యాలుగా ఇలా నిర్వచించారు.

"అనుభావవిభావానాం వర్ణనా కావ్యముచ్యతే
తేషామేవ ప్రయోగస్తు నాట్యం గీతాది రంజితం"

ఒక భావాన్ని రసయుక్తంగా వ్యక్తపరిస్తే అది కావ్యం అవుతుంది. దానికి గీతాన్ని చేరిస్తే శ్రవ్యకావ్యం ఆపైని నాట్యాన్ని చేరిస్తే దృశ్య కావ్యం అన్నారు. శ్రవ్యకావ్యాన్ని ఒక్కరు కానీ బృందంగా కానీ పాడుకోవచ్చును. అన్నిటికి

ఉన్నట్టే కావ్యానికి కూడా కొన్ని లక్షణాలు, నియమాలు ఉన్నాయని పదలాలిత్యకవి దండిన కావ్యాదర్శంలో రాస్తారు. నాంది, ప్రస్తావన, అంక నిర్మాణం, పాత్రలు , మంగళ వాక్యం వంటివి. ఈ రూపకానికి మంగళ వాక్యం "పవమాన సుతుడు పట్టు పాదారవిందములకు నీ నామ రూపములకు నిత్య జయ మంగళం" అన్నకృతి. చాలా మంది వినే ఉంటారు. నాంది ఏ రాగంలో మొదలు పెట్టేరో అదే రాగంలో మంగళవాక్యం కూడా రచించి ముగిస్తారు.

సాహిత్యదర్పణంలో నాంది ఇలా ఉండాలని రాస్తారు

"ఆశీర్వచన సంయుక్తా స్తుతిర్యస్మాత్ ప్రయుజ్యతే
దేవ ద్విజ నృపాదీనాం తస్మాన్నాంది ఇతి సంజ్ఞిత"

అంటే దేవ, ద్విజ, రాజులను స్తుతి చేసి, వారి నుంచి ఆశీర్వాదం పొందాలన్నది నాంది నియమం. ఇక్కడ దాన్ని పాటిస్తూ గణపతిని స్తుతి చేయడం మనకి తెలుస్తోంది. ఈ రూపకం అయిదు అంకాల్లో నలభై అయిదు కృతులు, సూత్రధారికి తగు పద్య, గద్య, రచనతో, పాత్రల వాగ్వివాదాలతో ప్రహ్లాదుని కథ, అతని అకుంఠిత హరిభక్తి, దానివలన అతను పడిన ఇక్కట్లు వర్ణిస్తూ ఉంటాయి. నాంది కృతిలో శ్రీగణపతిని సేవింపరారే అని బహువచన ప్రయోగం వలన త్యాగరాజు వారు నలుగురిని చేర్చి బృందగానం చేద్దాం అన్న ఊహని సూచిస్తున్నారు.

తర్వాత వాసుదేవయని వెడలిన ఈ దౌవారికుని గనరే అని కళ్యాణి రాగం కృతిలో దౌవారికుడు వీధుల్లో బాగుగా నట నముతో భజన చేస్తూ వచ్చి సూత్రధారిని పరిచయం చేసి కథా ప్రస్తావన చేస్తాడు. అప్పట్లో కరపత్రాలు ప్రకటనలు ఎక్కువ లేవేమో. ఈ దౌవారికుడు వీధుల్లో పాడుతూ వస్తుండగా అతని వెనక జన సమూహం చేరగా ఆ సభకి శ్రోతల్ని పోగు చేస్తారన్నమాట. అక్కడ సూత్రధారుడు వారిని, సంగీత సాహిత్య ప్రక్రియలతో కట్టిపడేసేట్టు కథ ప్రారంభమవుతుంది.

ప్రహ్లాదుని, సముద్రంలో పడవైచినప్పుడు "సాగరుండు వెడలె నిదో సారెకు గనరారే – బాగుగ ప్రహ్లాదుని వర యోగిని కౌగిట జేర్చి సాగరుండు వెడలే" అని సముద్రుడు అతన్ని కౌగిట పట్టి పైకి చేర్చిన దృశ్యం, అదయ్యాక "వినతాసుత రారా నా వినుతి గైకొనరా – ఘన నాగ పాశంబుల ఖండించ రారా" అని అతన్ని నాగు పాములతో కరిపించినప్పుడు, వినతా సుత అంటే గరుత్మంతుడిని వచ్చి ఆ సర్పాలని ఖండించమని వేడుకోవడం, ఒక్కొక్క ఘట్టం వివరంగా వర్ణిస్తూ అన్ని కృతులు కూడా కళ్ళకి కట్టినట్టుగా పరమాత్భుతంగా శ్రవ్య, దృశ్యకావ్యానికి అనుగుణంగా రచించేరు. ఎవరైనా దీనిని దృశ్య రూపకంగా ప్రదర్శిస్తే ఎంతో రసవత్తరంగా ఉంటుంది. కానీ ఇది పెద్ద రూపకం. ఆ రోజుల్లో యక్షగానాలు, వీధి భాగవతాలు రాత్రి మొదలుపెడితె తెల్లవారేదాకా జరిగేవని వినికిడి. అంత సమయం వెచ్చించడం అరుదైన ఈ రోజుల్లో అది కాస్త తలకు మించిన పనే. ఇందులో రాద్దాం అనుకున్నా ఈ వ్యాసం పెద్దగ్రంధం అవుతుంది. అందువల్ల ఆ కృతులన్నిటిని మీ మీ సమయానుకూలంగా విని ఆనందిస్తారని కోరుకుంటూ, దానికి నాందిగా ఈ కృతి.

సంగీతం ఇదం పుణ్యం సంగీతం ఇదం సౌఖ్యం
సంగీతం ఆరోగ్యప్రదం  సంగీతం శాంతియుతం

తనికెళ్ళ చంద్ర భాను కర్ణాటక సంగీతంలో ప్రావీణ్యత పొందిన ఏ. ఐ. ఆర్ కళాకారిణి. దుర్గాబాయి దెష్మఖ్ సంగీత కళాశాలలో సంగీతాచార్యులుగా పని చేస్తున్నారు. దేశ విదేశాల్లోను, టీటీడీ, ఎస్ వి బి సి ఛానెల్ లోను విరివిగా కచేరిలు చేస్తుంటారు.  ప్రస్తుతం బెంగళూరు నివాసస్తులు.

★★★★

COMMENTS